# భాష ఏదైనా . . . ఫిర్యాదు ఇక సులభం

హైదరాబాద్, బతుకమ్మ :పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్‌రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్‌రైటర్ యాప్ ను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ ఆవిష్కరించారు. దాని పనితీరును పరిశీలించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించుకోవచ్చు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో తెలుగు, ఇంగ్లీష్ రాని ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు ఫిర్యాదు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాష అర్థం కాక ఎఫ్.ఐ.ఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదవ్వడం వంటి సమస్యలకు ఈ యాప్ స్వస్తి పలకనుంది. 10కి పైగా ప్రధాన భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం ఈ యాప్ సొంతం. ఈ వినూత్న యాప్ ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సంస్థతో పాటు ఇంటర్న్ పాగ్రో చందు సహకారంతో హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొందించింది.

పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ ఏఐ ఆధారిత మల్టీలింగ్వల్ కంప్లైంట్ రికార్డర్‌ను అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ అన్నారు. హైదరాబాద్ ఒక గ్లోబల్ సిటీ కావడంతో ఇక్కడ తెలుగు, ఇంగ్లీష్ రాని వలసవచ్చిన ఇతర రాష్ట్రాల వారు, విదేశీయులు ఎందరో ఉంటారు. భాష తెలియకపోవడం వల్ల ఫిర్యాదు చేయడంలో జాప్యం జరగడం లేదా సమాచారం తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలకు ఈ యాప్ చెక్ పెట్టనుంది. బాధితుడు తన మాతృభాషలో మాట్లాడితే, ఈ యాప్ దానిని వెంటనే గుర్తించి, అనువదించి, అధికారిక రికార్డుగా మారుస్తుంది. మాట్లాడిన ప్రతి 5 సెకన్లకు సమాచారం అప్‌డేట్ అవుతుంది. ఈ సాంకేతికత వల్ల ముఖ్యంగా వలస కార్మికులు, మహిళలు, వృద్ధులకు పోలీసు సేవలపై భరోసా పెరుగుతుంది. బాధితులు చెప్పే ప్రతి మాటను యథాతథంగా నమోదు చేయడం వల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగి, తద్వారా నిందితులకు శిక్ష పడే అవకాశాలు మెరుగుపడతాయి. దీనివల్ల పోలీసు అధికారులకు టైపింగ్



భారం తగ్గడమే కాకుండా, రికార్డుల నిర్వహణ పద్ధతి ఏకరీతిగా ఉంటుంది.” అని ఆయన అన్నారు. న్యాయం పొందడానికి భాష ఎప్పటికీ అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ ఏఐ కాప్‌రైటర్ ఆధునిక పోలీసింగ్‌లో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ‘స్మార్ట్ పోలీసింగ్’ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడమే హైదరాబాద్ సిటీ పోలీస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు సీపీ (క్రైమ్స్ అండ్ సిట్) ఎం.శ్రీనివాసులు, ఐపీఎస్, అదనపు సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, డీసీపీ (ఎస్ఎమ్ఐటీ) సీహెచ్ రూపేష్, ఐపీఎస్, ఐటీ సెల్ ఇన్స్ పెక్టర్ రమేశ్, బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నగర పోలీసింగ్‌లో కృత్రిమ మేధ జోరు:

ఆధునిక పోలీసింగ్ పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్ ఏఐని విస్తృతంగా వినియోగిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ పనితీరులో మరింత సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో టెక్నాలజీ ఆధారిత పాలనకు ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగానే.. సైబర్ క్రైమ్ ఫిర్యాదులను పక్కాగా రూపొందించడానికి ఇప్పటికే ‘సి-మిత్ర’ లో ఏఐ సాంకేతికతను పోలీస్ శాఖ విజయవంతంగా అమలు చేస్తోంది. అలాగే సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందికి విధులను కేటాయించే ప్రక్రియలో ఏఐను వాడుతోంది. గతంలో ఉన్న మ్యాన్యువల్ పద్ధతుల స్థానంలో ప్రవేశపెట్టిన ఈ ఆటోమేటెడ్ విధానం వల్ల, ఎటువంటి పక్షపాతం లేకుండా సిబ్బందికి పోస్టింగ్‌లు కేటాయించబడుతున్నాయి. ఇది వ్యవస్థలో పూర్తి పారదర్శకతను పెంచుతోంది. సోషల్ మీడియాలో సమాజ శాంతికి భంగం కలిగించే అంశాలను గుర్తించేందుకు ‘సాక్-ఐ’ అనే ఏఐ ఆధారిత యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ఆన్‌లైన్ కంటెంట్‌ను నిరంతరం పర్యవేక్షించడమే కాకుండా, మహిళల, చిన్నారుల భద్రతకు విఘాతం కలిగించే పోస్టులను కనిపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. తాజాగా ఫిర్యాదుల నమోదు ప్రక్రియను కూడా ఏఐతో అనుసంధానించింది. అందుకు ఏఐ కాప్‌రైటర్ యాప్ ను రూపొందించింది. దీనివల్ల ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు మరింత వేగంగా, క్రమబద్ధంగా నమోదవుతాయి.

# ప్రభుత్వ విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సహకారం



హైదరాబాద్, బతుకమ్మ :హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రభుత్వ విద్యాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడానికి రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్‌లు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చిన ఈ సంస్థలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి తో జరిగిన సమావేశంలో రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి రహేజా, రామ్‌కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోదా గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా శాఖతో కుదిరిన ఒప్పందాలను ముఖ్యమంత్రి సమక్షంలో పరస్పరం అందజేసుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతి గదుల కోసం కొత్త ప్రాంగణ నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చులో 40 శాతం మేరకు (రూ.19.66 కోట్లు) వెచ్చించడానికి రాంకీ సంస్థ ముందుకొచ్చింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ఉన్నతీకరణలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి ఐదవ తరగతి, ఇంటర్ తరగతి గదుల నిర్మాణం కోసం మొత్తం వ్యయంలో 40 శాతం (రూ.10.4 కోట్లు) ఖర్చు చేయడానికి రాంకీ సంస్థ ఒప్పందం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతి గదుల నిర్మాణం కోసం అవసరమైన రూ.50.50 కోట్లు రహేజా గ్రూప్ ఖర్చు చేయడానికి ముందుకొచ్చి ఒప్పందం చేసుకుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్‌నగర్ ఎంపీపీఎస్ లో ప్రీ-ప్రైమరీ, 6వ, 7వ తరగతి గదుల కోసం అవసరమైన రూ.12.20 కోట్లు యశోదా హాస్పటల్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఖర్చు చేయనున్నట్టు తెలిపింది. ఈ ఒప్పంద కార్యక్రమంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసి) చైర్మన్ సి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకొచ్చిన సంస్థలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.



# వాట్సాప్ మట్కా. . . కేరాఫ్ బోరి..!

మట్కా మొన్నటి వరకు స్మార్ట్ ఫోన్ లలో స్రామాట్ యాప్ ద్వారా జరిగింది. అయితే యాప్ డౌన్ లోడ్ తో పాటు యూపీఐ చెల్లింపులు,పాస్ వర్డ్ ల విషయంలో చాలా మందికి సాంకేతిక విషయాలు అర్థం కాకపోవడంతో దాని స్థానంలో వాట్సాప్ మట్కాకు తెరలేపారు. వాట్సాప్ మట్కాలో ప్రధానంగా ఉదయం నుంచి మార్నింగ్ శ్రీదేవి, టైం బజార్, మధర్ డే, మిలాన్ డే, రాజధాని డే, కళ్యాణి, మిలాన్ నైట్, రాజధాని నైట్, మెయిన్ బజార్, కళ్యాణి నైట్ లాంటి గేమ్ ల ద్వారా మట్కాను ఆడిస్తున్నారు. ఒకప్పుడు నాందేడ్, ధర్మాబాద్ ఇతర ప్రాంతాల నుంచి మట్కా గేమింగ్‌ను ప్రస్తుతం బోరి అక్రమించింది. కేవలం నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ ప్రాంతాల నుంచి యూపీఏ చెల్లింపులు నిత్యం రూ.20 లక్షల వరకు ఉన్నాయని టాక్ ఉంది. మొన్న పోలీసులు బోరి ప్రాంతంలో మట్కాపై ఉక్కు పాదం మోపినప్పుడు వెనుకబడిన ఆట మళ్ళీ పుంజుకుంది. కీలక బూకీ స్థానంలో సబ్ ఏజంట్లు ప్రవేశించడంతో ఇప్పుడు ఈ గేమ్ 20 మట్కా గేమ్ లు అయితే 50 యూపీఏ చెల్లింపులుగా సాగుతున్నట్లు తెలిసింది.

# ఎల్లయ్య చెరువులో జోరుగా మట్టి అక్రమ రవాణా...



వాణిజ్య అవసరాలకు మట్టిని తరలించాలంటే నీటిపారుదల, రెవెన్యూ, స్థానిక సంస్థల అనుమతులు అవసరం కాగా, అవి లేకుండానే భారీగా మట్టి రవాణా జరుగుతుంది.చెరువులో జేసీబీలతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలించి వ్యాపారం చేస్తే మట్టి మాఫియా మీద కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రభావవంతమైన వ్యక్తులు అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుని, జరుగుతున్న అక్రమాలు బయటపడకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు మట్టి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో జరుగుతున్న అక్రమ మట్టి తరలింపుపై ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారా?.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

**కలెక్టర్ కు ఏడుగురు కౌన్సిలర్ ల లేఖ**

బాన్సువాడ పురపాలక సంఘంలోని బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్ లు ఏడుగురు చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై శనివారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మొదట ఆర్డీఓకు, ఇరిగేషన్ శాఖకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో కలెక్టర్ ను ఆశ్రయించారు. వారు మాట్లాడుతూ రోజూ సుమారు 100 ట్రాక్టర్ లు, 30 నుంచి 40 టిప్పర్ లు, 6 జేసీబీలతో చెరువు మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో చెరువులో చెపలు పట్టే అవకాశం ఉండదని వాపోయారు. మట్టి రైతులకు కాకుండా ఇటుక బట్టీలకు ప్లాట్ల వారికి అమ్ముతున్నారని, ఒక్కో టిప్పర్ రూ.2500, ట్రాక్టర్ రూ.800 చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. ఆర్డీఓ ప్రత్యేకంగా కొందరు కాంట్రాక్టర్ లను పిలిచి రైతుల పొలాలకు మాత్రమే వెళ్లేలా రేటు ఫిక్స్ చేయాలని కోరినట్టు లేఖలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకే తవ్వకాలకు అనుమతి ఉందని ఆర్డీఓ చెప్పినా ఉదయం 7 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్డీఓ ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ లు నస్రీన్, అంజూమ్, ఆమనీ, మానస, అంజిగౌడ్, మఖబుల్ లేఖలో పేర్కొన్నారు.



# హిట్ అండ్ రన్ కాదు... పక్కా మర్డర్...

హైదరాబాద్, బతుకమ్మ:హైదరాబాద్‌లో సంచలనం.. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య కేసుగా మారిన హిట్ అండ్ రన్..హైదరాబాద్‌లో సంచలనం రేపిన మాసబ్‌ట్యాంక్ హిట్ అండ్ రన్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. కారుతో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ చికిత్స పొందుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. దీంతో ఈ ఘటనను పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం.. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో గుర్తు తెలియని దుండగులు కారుతో ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.మొదట హిట్ అండ్ రన్‌గా నమోదు చేసిన కేసును, సిసి టివి పుటేజీలతో స్థానికంగా దొరికిన సాక్ష్యాలతో మొయినుద్దీన్ మృతి అనంతరం హత్య కేసుగా మార్చారు పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వక్ఫ్ భూవివాదం నేపథ్యంలోనే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితుల కోసం ప్రత్యేకంగా 5 బృందాలతో గాలింపు చేపట్టారు.